ప్రజాశక్తి

శనివారం 12 ఆగస్టు 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

వన్‌టౌన్లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

ముఠా కార్మికుల సమ్మె ఉధృతం

రెండో రోజూ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలోని వివిధ వ్యాపారాల వద్ద ఎగుమతి దిగుమతులు చేసే ముఠా కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. ముఠా కార్మికులు తమ పనులను నిలిపివేసి వన్‌టౌన్‌లోని చిట్టూరి కాంప్లెక్స్ వద్దకు భారీగా చేరుకున్నారు. సమ్మెలో భాగంగా చిట్టూరి కాంప్లెక్స్ నుండి పలు వీధుల్లో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సిఐటియు జిల్లా నాయకులు.డి.వి.కష్ణ, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులు, కార్మిక సంఘాలు ఇప్పటికే అనేకసార్లు కూలీ రేట్లు పెంచాలని వ్యాపార యజమానులకు విన్నవించారని, అయినా యజమానులు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించటం వల్ల సమ్మె అనివార్యమైందన్నారు. ఒక పక్క పెరిగిన నిత్యావసరాలు, మరోపక్క పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు బాగా పెరిగిపోయాయని అన్నారు. దీంతో ఆదాయం తగ్గి, ఖర్చులు పెరిగిపోవడంతో ముఠా కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రెండేళ్లకోసారి కూలి రేట్లు పెంపుదల ఒప్పందం మేరకు...గత కూలి రేట్లు ఒప్పంద కాలం గడిచిపోయి మూడు నెలలైనా కూలి పెంపునకు వ్యాపారులు ముందుకు రాకపోవటం విచారకరమన్నారు. వ్యాపారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి కార్మిక నాయకులతో కూలి రేట్ల పెంపుపై ఒప్పందం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘాల నాయకులు సీతారాములు, నాగేశ్వరరావు, దాసు, చౌదరి, శ్రీరామమూర్తి, ఎస్.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం లేదు... విత్తనాలతో సరిపెట్టేశారు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ప్రకృతి వైపరీత్యాలకు తోడు ప్రభుత్వాలు అనుసరించే విధానాలు రైతులను నష్టాలకు, కష్టాలకు గురిచేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో ప్రాథమిక దశలో ఉన్న పంటలు దెబ్బతింటే పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించడం లేదు. 80 శాతం రాయితీపై విత్తనాలు ఇచ్చి సరిపెట్టేస్తోంది.

జూలై ఆఖరు వారంలో కురిసిన వర్షాలకు కాల్వలు, డ్రయిన్లు పొంగి కృష్ణాజిల్లాలో లక్షా 29 వేల 936 ఎకరాల విస్తీర్ణంలోని వరి పొలాలు, సాగుకు సిద్ధం చేసిన వరి నారుమళ్లు ముంపునకు గురయ్యాయి. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదికలో పేర్కొంది. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలంటే ప్రాథమిక నివేదక తర్వాత నష్టం తాలూకా అంచనాలు వేసి తుది నివేదిక సిద్ధం చేయాలి. దీని ఆధారంగానే ప్రభుత్వాలు పరిహారం చెల్లిస్తాయి. వరి సాగుకు సంబంధించి తొలిదశలో నష్టం తక్కువగా ఉంటుందనే కారణాన్ని చూపుతూ వ్యవసాయశాఖ ద్వారా తుది అంచనాలను రూపొందించేందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.12 వేలకుపైగా ఖర్చు పెట్టి నష్టపోయినా బాధిత రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పంట పండించి విక్రయించే సమయంలో కనీస మద్దతు ధర అందక అయినకాడకు అమ్ముకుని నష్టపోతున్న రైతులకు, ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ కనీస ఊరట లేకుండా పోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

❁పంటలు దెబ్బతిన్న రైతులకు రిక్తహస్తం

తొమ్మిది మండలాల్లో రాయితీపై వరి విత్తనాలు

ముంపునకు గురైన పంట పొలాల్లో తిరిగి నాట్లు వేయడానికి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం రాయితీపై విక్రయిస్తోంది. జిల్లాలో రెండు వేల క్వింటాళ్ల వరకు వరి విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీని ఆధారంగా పెడన, బంటుమిల్లి, మచిలీపట్నం, గూడూరు, గుడివాడ, గన్నవరం, పమిడిముక్కల, పెనమలూరు తదితర ఎనిమిది మండలాల్లో ప్రభుత్వం రాయితీపై విత్తనాలు అందిస్తోంది. ఎంటియు 1121 రకం విత్తనాలు కిలో రూ.37.80, 80 కాగా, సబ్సిడీపోను కిలో రూ.7.56 చొప్పున 30 కిలోల బ్యాగ్‌ను రూ.226.80లకు, ఎంటియు 1318, 1061, 7029 రకాల విత్తనాలు కిలో రూ.38.10 కాగా, సబ్సిడీ పోను కిలో రూ.7.62 చొప్పున 30 కిలోల బ్యాగ్‌ను రూ. 228.60లకు పంపిణీ చేస్తున్నారు. అలాగే బిపిటి 5204 విత్తనాలు కిలో రూ.37.90 కాగా, సబ్సిడీపోను కిలో రూ.7.58 చొప్పున 25 కిలోల బ్యాగ్‌ను రూ.189.50లకు విక్రయిస్తున్నారు.

2 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు కోరాం

ఎన్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ దశల్లో ఉన్న వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇవన్నీ ప్రాథమిక దశలోనే ఉన్నాయి. రైతులు తిరిగి మళ్లీ సాగు చేసేందుకు ప్రభుత్వం తోడ్పాటు ఇస్తోంది. 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అందిస్తోంది. మొదట వెయ్యి క్వింటాళ్లు వచ్చాయి. ఎనిమిది వందల క్వింటాళ్ల వరకు విక్రయించాము. రైతుల డిమాండ్ ఆధారంగా అవసరమైతే మరో వెయ్యి క్వింటాళ్ల వరి విత్తనాలు సబ్సిడీపై ఇస్తాం.

పొదుపు సంఘాలను నిలబెట్టిన ఘనత మాదే

❁'సున్నా వడ్డీ' పంపిణీలో మంత్రి రోజా ❁'కృష్ణా'లో 35,752 గ్రూపులకు రూ.46.02 కోట్లు జమ

'వైఎస్ఆర్ సున్నా వడ్డీ' చెక్కును అందిస్తున్న మంత్రి రోజా, చిత్రంలో ఎంఎల్ఎలు సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని నాని తదితరులు

ప్రజాశక్తి - అవనిగడ్డ : ప్రజలకు మేలు చేసే ఏ పథకమైనా ప్రవేశపెట్టాలంటే చల్లని మనసు సైతం ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన అభ్యుదయ శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కష్ణాజిల్లా అవనిగడ్డ ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో 4వ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం జిల్లా స్థాయి కార్యక్రమం జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ గతంలో రుణాలు సకాలంలో చెల్లించని కారణంగా సంఘాల పరపతి దెబ్బతిని అప్పటివరకు ఏ, బి గ్రేడ్‌లో ఉన్న సంఘాలు సి, డి గ్రేడ్లకు పడిపోయాయని గుర్తు చేశారు. అయితే

(మిగతా 6లో)

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : కలెక్టర్ డిల్లీరావు

'ఎన్‌టిఆర్'లో 36,810 గ్రూపులకు రూ.52.16 కోట్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : మహిళలకు ఆర్థిక సహాయం అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లాలో నాలుగో విడత ద్వారా 36,810 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు చెందిన 3,80,632 మంది మహిళలకు సున్నా వడ్డీ కింద రూ.52.16 కోట్ల ఆర్థిక సహాయం అందజేశారు. సిఎం కార్యక్రమాన్ని కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రత్యేక్షంగా వీక్షించిన అనంతరం జిల్లాకు చెందిన మహిళలకు ఆర్థిక

(మిగతా 6లో)

చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ డిల్లీరావు, ఎంఎల్ఏలు విష్ణు, వెలంపల్లి

రూ.50 లక్షల నగదు పట్టివేత

నగదు, కారు సీజ్ : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎలాంటి ఆధారాల పత్రాలు లేకుండా రూ.50 లక్షలు అక్రమంగా తరలిస్తున్న కారును స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టబడిన నగదు, కారు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్‌కు చెందిన కవిత అనే మహిళ విజయవాడలోని ఆర్‌వి కష్ణారావు అనే వ్యక్తికి ఇన్నోవా కారులో రూ.50 లక్షల నగదు పంపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని కీసర టోల్‌గేట్ వద్ద నందిగామ రూరల్ సిఐ ఐవి.నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. విజయవాడవైపు వచ్చే ఇన్నోవా కారును కూడా తనిఖీ చేశారు. ఆ కారులో రూ.50 లక్షల నగదును గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్ ఆరిఫ్‌ను, అతని సహాయకుడు బన్నీని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఇద్దరూ హైదరాబాద్ నుండి విజయవాడకు నగదు తరలిస్తున్నట్లు వెల్లడించారు. నగదును, కారును సీజ్ చేశారు. డ్రైవర్ ఆరిఫ్, బన్నీపై కేసు నమోదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

కరపత్రాల ఆవిష్కరణ

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గంపలగూడెం: ఎన్టీఆర్ జిల్లా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కర పత్రాలను ముద్రించింది. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, తదితర విష జ్వరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పొందుపరిచారు. సదరు కరపత్రాలు మండలంలో సత్యాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరపత్రాలను విస్తతంగా ప్రజలకు అందజేయాలని ఇబ్బందులు కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కులం, మతోన్మాదం నశించాలని ధర్నా

ధర్నా చేస్తున్న స్థానికులు, పాల్గొన్న నటరాజ్

పెనుగంచిప్రోలు : కుల, మతోన్మాదం నశించాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక పడమర బజార్ అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నటరాజు మాట్లాడుతూ క్విట్ ఇండియా నినాదంతో బ్రిటిష్ వాళ్ళను భారత జాతి ప్రజలు తరిమివేశారని, బిజెపి ఫాసిస్టు ప్రభుత్వాన్ని, ఆర్ఎస్ఎస్ సంస్థలను దేశం నుంచి పారదోలాలని నినదించారు. భారత రాజ్యాంగానికి మూలస్వరూపమైన లౌకిక భావనలను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచడం జరిగిందని ఈ రోజు భారతదేశంలో ఆర్ఎస్ఎస్ చెప్పున్నట్లు, ఆడుతున్న నరేంద్ర మోడీ, అమిత్‌షాలు భారతదేశాన్ని మతోన్మాద రాజ్యాంగా మార్చటానికి పూనుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో, కమిటీ సభ్యులు కాకాని వెంకయ్య, తుమ్మల వెంకటరమణ, సైదా, నాగేశ్వరరావు, ముళ్లపాటి ఆనందరావు, సిఐటియు నాయకులు ధారా నాగేశ్వ రరావు, మహిళాలు ముక్కు సీతమ్మ ,వెంకాయమ్మ తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్లకు మరమ్మతులు

రోడ్ల పనులు చేయిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : మండల కేంద్రం నుండి మక్కపేట వెళ్లే రహదారి పడమర బజార్ అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంటలను శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ విశ్రాంతి ఉద్యోగి అయిన నల్లూరి. వెంకటేశ్వరరావు తన సొంత ఖర్చులతో శుక్రవారం మరమ్మతులు నిర్వహించారు. గురువారం రాత్రి దేవాలయం వద్ద నుండి తన ఇంటికి వెళ్తున్న సమయంలో ఒక ద్విచక్ర వాహనదారుడు గుంటలో పడి భార్యా పిల్లలు ప్రమాదానికి గురి కావడంతో చలించిపోయిన ఆయన తన సొంత ఖర్చులతో తానే స్వయంగా దగ్గరుండి గుంటలను పూడ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వెంటనే స్పందించి మరమ్మతులు నిర్వహించిన వేంకటేశ్వరుని ఆ ప్రాంతంలోని ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, పలువురు అభినందించారు.

క్రీడా దుస్తులు అందజేత

క్రీడా దుస్తులు అందజేసిన వెంకటాద్రి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు దాతలు క్రీడా దుస్తులు అందజేశారు. గోకుల్ జ్యుయలరీ మార్ట్ యజమాని రాచబంటి వెంకటాద్రి కుమార్డు హరికష్ణ రూ.15000 విలువైన క్రీడా దుస్తులను శుక్రవారం ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరాజుకు అందజేశారు. తమ విద్యార్థినులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ. స్థాయిలో ఆటల పోటీల లో అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

పాసింజర్ రైలు నడపాలని రైల్వే మంత్రికి సామినేని వినతి

వినతిపత్రం ఇస్తున్న సామినేని ఉదయభాను

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన జగ్గయ్యపేటకు పాసింజర్ రైలు ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను శుక్రవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని శ్రీ వైష్ణవ్‌ను రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి ద్వారా కలిసి ఢిల్లీలోని పార్లమెంటు సెంట్రల్ హాల్ కమిటీలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ 30 ఏళ్లుగా జగ్గయ్యపేట గూడ్స్ రైల్వేస్టేషన్ నుండి రైల్వే శాఖకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తుందన్నారు. ప్యాసింజర్ లైన్ ఉన్నప్పటికీ రైలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ విషయంపై రైల్వే మంత్రి స్పందిస్తూ దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్‌లో ఆధునీకరించడం జరిగిందని, అందులో భాగంగానే ప్యాసింజర్ రైలు జగ్గయ్యపేటకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

ఎంపి కేశినేనిని విమర్శించే స్థాయి వెలంపల్లికి లేదు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎంపీ కేశినేని నానిని విమర్శించే స్థాయి ఊసరవల్లి వెలంపల్లికి లేదని తెలుగుదేశం పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ మండిపడ్డారు. శుక్రవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ నిన్న 43వ డివిజన్‌లో శిలాఫలకం ప్రారంభోత్సవంలో వెలంపల్లి ఎంపిపై బుద్ధిలేని వ్యాఖ్యలు చేసారంటూ తీవ్రంగా ఖండించారు. శాసనసభ్యుడిగా నువ్వు నియోజకవర్గానికి చేసిన అభివద్ధి ఏమీలేదని ధ్వజమెత్తారు. వెలంపల్లి రోజు తిరుగుతూ చూస్తున్న దుర్గగుడి ఫ్లైఓవర్ సాధించిన ఘనత కేశినేనికే దక్కుతుందని బేగ్ అన్నారు. అంతేకాకుండా నీ దొంగ ప్రభుత్వం హయాంలో బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్, రెండవ మార్గాన్ని కూడా అప్రూవల్ సాధించి నిర్మించిన ఘనత కేశినేని నానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా కార్యాలయం కార్యదర్శి సారిపల్లి రాధాకష్ణ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, జిల్లా అధికార ప్రతినిధి బెవర సాయి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురం 33వ డివిజన్‌లో రూ.60 లక్షల అంచనా విలువ కల్గిన అభివృద్ధి పనులకు డిప్యూటీమేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలిసి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సత్యనారాయణపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. నాలుగేళ్లలో రూ. కోటి 36 లక్షల నిధులతో డివిజన్లో 1.36 కి.మీ. మేర రహదారుల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోవడాన్ని గుర్తించడం జరిగిందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. నూతన రహదారుల నిర్మాణంతో ఈ ప్రాంత ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింద

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు...

న్నారు. ఇప్పటివరకు 11 వీధులలో రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు శనగవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులతో ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.రవీంద్ర రావు అధ్యక్షతన రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో హౌసింగ్, రీసర్వే , ఇతర రెవెన్యూ సంబంధిత విషయముల గురించి చర్చించారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో గల తహశీల్దార్లు, జగ్గయ్యపేట మున్సిపల్ కమీషనర్, డిఇఇ హౌసింగ్, జగ్గయ్యపేట, పిడిఎస్ డిప్యూటీ తహశీల్దార్లు, ఎఇలు హాజరయ్యారు.

ఏరియా ఆస్పత్రి పనుల పరిశీలన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.మూడు కోట్లతో సాగుతున్న అదనపు బిల్డింగ్ నిర్మాణ పనులను, డయాలసిస్ రోగులకు అందుతున్న సేవలపై ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి శుక్రవారం ఆసుపత్రి మెడికల్ అధికారిని గారిగేయతో కలిసి సమీక్షించారు. పనులను త్వరగా పూర్తిచేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆసుత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించి మెరుగుపరచాలని డాక్టర్లకు సూచించారు. డయాలసిస్ కేంద్రంలో రోగులకు ఆసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు.

పవన్ సిఎం కావాలని పాదయాత్ర

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న ఎన్నికల్లో జనసేన ఘనవిజయం సాధించి ఈ రాష్ట్రానికి పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం జనసేన విజయవాడ నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాజుద్దిన్ (ఐజా) ఆధ్వర్యంలో జనసైనికులతో భారీపాదయాత్ర జరిగింది. భవానీపురంలోని గాలిబ్ షాహీద్‌దర్గాలో చాదర్ సమర్పించిన అనంతరం వందలాదిమంది జనసైనికులతో గయాజుద్దీన్ పాదయాత్రగా బయలుదేరి దుర్గమ్మ గుడికి చేరుకుని అక్కడి కామధేను అమ్మవారికి సారే సమర్పించారు. ఈ సందర్భంగా గయాజుద్దీన్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని, ప్రజా బలంతో పాటు దేవుళ్ళ ఆశీస్సులు కూడా సంపూర్ణంగా వారిపై ఉండాలని భవానీపురంలోని గాలి షాహిద్ దర్గా నుంచి అమ్మవారి గుడి దాకా పాదయాత్ర నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా గయాజుద్దీన్‌కి క్రియాశీల సభ్యత్వం లేదని జనసేనలో ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారంపై గయాజుద్దీన్‌ను విలేకరులు ప్రశ్నించగా తనకు సభ్యత్వం లేకపోతే ఇప్పటివరకు అనేక

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న గయాజుద్దీన్ తదితరులు

కార్యక్రమాలను తాను ఎలా నిర్వహించగలిగానని ప్రశ్నించారు. తనపై కక్ష కట్టి జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ అవాస్తవాలను ప్రచారం చేయడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రావి సౌజన్య, అబ్దుల్ మన్నాన్ , షేక్ బాషా, ఈశ్వర్ తదితరులతో పాటుగా పెద్ద సంఖ్యలో పశ్చిమ నియోజకవర్గంనకు చెందిన జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: డాక్టర్. కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్.ఎస్.కష్ణంరాజు, వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం.రాజనరసింహులు బెట్ట వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శుక్రవారం రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వాతావరణం గురించి తెలియజేస్తూ, ఈ నెలలో ఇప్పటివరకు నమోదు కావలసిన సాధారణ వర్షపాతం 37.9 మిల్లీమీటర్లు గానూ ఎటువంటి వర్షపాతం నమోదు కాలేదు. దీనికి తోడు కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఏడు శాతం అధికంగా నమోదు కావడంతో గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటం వలన జిల్లాలో ప్రధాన పంటలైన పత్తి, నారుమడి దశలో వున్న మిరప, పెసర, మినుము పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధతి ఎక్కువగా వుండే అవకాశం ఉందన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని మల్కాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉపఎన్నికల్లో అంభోజి పుల్లారావు (జాన్), అనుమంచిపల్లి నాలుగో వార్డ్ మెంబర్‌గా కందిబండ వసంత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గ్రామపంచాయతీ ఎన్నికల అధికారులు ఎ.నరసింహారావు, జి.సిద్ధారెడ్డి తెలిపారు. సర్పంచ్ ఉప ఎన్నికల్లో అంబోజి పుల్లారావు, వార్డు మెంబర్ ఎన్నికల్లో ఒక్కరే నామినేషన్ దాఖలు చేయటంతో ఎన్నిక ఏకగ్రీవంగా అయినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మల్కాపురం గ్రామ సర్పంచ్ 2021లో అంబోజి మణి, అనుమంచిపల్లి 4వ వార్డ్ మెంబర్ కందిబండ ఆంజనేయులు మతి చెందడంతో ఆయా గ్రామాల్లోని సర్పంచ్, వార్డ్ మెంబర్ ఎన్నిక అనివార్యమైన విషయం విధితమే.

వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో 7వ వార్డు ఆర్టీసీ కాలనీ, ఎనిమిదవ వార్డులలో శుక్రవారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ వార్డులో గడపగడపకు పర్యటించారు. టిడిపి నూతన మేనిఫెస్టో ప్రతి ఇంటికి చేరువయ్యేలా భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాలుగున్నర ఏళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, అభివద్ధి జరగాలంటే అది టిడిపితోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సైదేశ్వర రావు, నాయకులు బోసు యాదవ్ గడ్డ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్షర స్కూల్‌లో రెడ్‌డే

ప్రజాశక్తి కంచికచర్ల : స్థానిక శ్రీ అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం రెడ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణ, తరగతి గదుల్లో ఎర్రటి బెలూన్లు, తోరణాలతో అలంకరించారు. విద్యార్థులు, సిబ్బంది ఎర్రటి దుస్తులు ధరించారు. దీంతో పాఠశాల ప్రాంగణ మంతా ఎరుపుమయమైంది. ఎరుపు యొక్క ప్రాముఖ్యతను సిబ్బంది విద్యార్థులకు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: విజయవాడ నుండి హైదరాబాదు వెళ్ళు జాతీయ రహదారి 65పై ఇబ్రహింపట్నం మండలం జూపూడి గ్రామం ధనలక్ష్మి ఫ్లై యాష్ బ్రిక్స్ వెళ్ళుదారి వద్ద గుర్తు తెలియని యాచకుడిని విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎపి 16 టివై 2239 అను నెంబర్ గల లారీ డ్రైవర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సదరు మతుడు కిలేశపురం జూపూడి గ్రామాల మధ్య యాచించు కుంటూ బ్రతుకుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అతని వయసు సుమారు 60 నుండి 65 ఉండవచ్చని తెలిపారు.

సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లింపు తగదు

గన్నవరంలో భవన నిర్మాణ కార్మికుల ఆందోళన - ఎంఎల్ఎ కార్యాలయంలో సామూహిక వినతిపత్రం

ప్రజాశక్తి-గన్నవరం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం చేశారని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లి నరసింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు నిధులు తిరిగి జమ చేయాలని కోరుతూ శుక్రవారం గన్నవరం పట్టణంలో పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేశారని మండిపడ్డారు. కార్మికులకు పనులు లేకపోవడంతో జీవనం సాగగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు వారికి పూర్తిగా అందడం లేదన్నారు. సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించి కార్మికుల ప్రయోజనాన్ని కాలరాసారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన తప్పులను తెలుసుకుని సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమ చేయాలన్నారు. సర్క్యులర్ 1214 ని రద్దు చేసి సంక్షేమ బోర్డు పునః ప్రారంభించాలని, పెండింగ్ క్లైమ్స్ పరిష్కరించాలని, గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని కోరారు. సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించడంతో భవన నిర్మాణ కార్మికులు పథకాల కోసం దరఖాస్తు చేసుకొని పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారని, పరిహారాలు రాకపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో కూడా నిర్లక్ష్యం జరుగుతుందని అన్నారు. దేశంలో సంక్షేమ బోర్డుని నిలిపివేసింది ఒక్క ఆంధ్రప్రదేశ్లో మాత్రమేనని తెలియజేశారు. ఎన్నడూ లేనంతగా ఇసుక, సిమెంటు, కంకర లాంటి నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు పని తగ్గిపోయి పక్క రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వాడున్న సంక్షేమ బోర్డు నిధులు రూ.831 కోట్లు తిరిగి బోర్డులో తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లా అధ్యక్షులు పి.అప్పారావు, ఆర్.సురేష్, విజయవాడ రూరల్ మండలం అధ్యక్షుడు వి.కనకరావు, నిడమానూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.కృష్ణమూర్తి, ఎనికేపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు కే.ఆదిశేషు, నాయకులు ఎం వెంకటేష్, నారాయణ, బి.అంకమరావు, గిరిధర్, శ్రీనివాసరెడ్డి, బడుగు మరియదాసు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

9న లోక్‌అదాలత్

ప్రజాశక్తి-బంటుమిల్లి: వచ్చే నెల తొమ్మిదవ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంను విజయవంతం చేయాలని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మండల న్యాయ సేవా సాధికార సంస్థ చైర్మన్ మరియు మెజిస్ట్రేట్ ఈ సుధాకర్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ వారు,పోలీస్ మరియు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ తదితర శాఖలతో లోక్ అదాలత్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ సుధాకర్ రావు మాట్లాడుతూ కక్షిదారులు రాజీ పడ్డదగ్గ కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవాలని సూచించారు. తద్వారా వారి విలువైన సొమ్ము సమయం ఆదా చేసుకుని ఇరు వర్గాల వారు సామరస్య వాతావరణం లో మేలగవచ్చని పేర్కొన్నారు. అందుకు అర్హులైన వారందరినీ లోక్ అదాలత్ పై అవగాహన కల్పించాలని వారికి సూచించారు. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకుని వీలైనంత ఎక్కువ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

'విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి-చల్లపల్లి: ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా చేపట్టిన మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ పిలుపునిచ్చారు. నియోజక వర్గాల పర్యటనలో భాగంగా శుక్రవారం చల్లపల్లి ఎస్సీ కాలనీలో అవనిగడ్డ నియోజక వర్గ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సురేష్ మాట్లాడుతూ చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతీ మాదిగ పల్లెలపై ఉందని, మాదిగ అస్తిత్వం పతాకస్థాయిలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేసి మాదిగ ఉపకులాల చిరకాల కోరిక అయిన ఎస్‌సి వర్గీకరణ సాధించుకోవడానికి ప్రతీ మాదిగ తరలి రావాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీలో 66శాతం మాదిగలు వైసీపీకి మద్దతు ఇచ్చిన నేపథ్యంలో జగన్మోహనరెడ్డి వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ఇంఛార్జి కోటా డానియేలు, జిల్లా అధ్యక్షులు కొల్లూరి బసవ, అవనిగడ్డ కన్వీనర్ కొక్కిలిగడ్డ నవీన్, కో కన్వీనర్ కొడాలి ఏలీయా, ఎంఆర్‌పిఎస్ అవనిగడ్డ అధ్యక్షులు కొక్కిలిగడ్డ సువర్ణ రాజు, చల్లపల్లి మండల అధ్యక్షులు కొల్లూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్‌సిసి విభాగం రెడ్ క్రాస్‌తో కలిసి శుక్రవారం ఉచితదంత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా కష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.జ్ఞానమణి, రెక్టార్. ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రామిరెడ్డి, కష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.విజయ కుమారి హాజరయ్యారు. డా.డి.రామ శేఖర రెడ్డి ఎన్ సి సి క్యాడెట్‌లకు నాయకత్వం వహించారు. కృష్ణా యూనివర్శిటీ రెక్టార్ ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఇలాంటి సహాయ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. హ్యాపీ డెంటల్ క్లినిక్‌కి చెందిన డాక్టర్ తనూజను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.జ్ఞానమణి ఘనంగా సత్కరించారు.

లౌకికత్వాన్ని కాపాడుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఉయ్యూరు: భారతదేశ లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, స్వాతంత్ర ఉద్యమంలో అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న అన్నారు. శుక్రవారం ఉయ్యూరులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్రం ఉద్యమం యువకుల పాత్ర అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు బి.కీర్తి అధ్యక్షత వహించిన సదస్సులో రామన్న మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే దేశం గురించి ప్రజల గురించి సామ్రాజ్యవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రాణాలు సైతం దేశానికి ఫణంగా పెట్టిన భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ వంటి స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను యువతి యువకులు తెలుసుకోవాలని కోరారు. బ్రిటిష్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ ధైర్యంగా ఎదుర్కొనే బ్రిటిష్ పాలకులను గడగడలాడిచ్చిన వ్యక్తి భగత్ సింగ్ అని అన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో ఎందరో ప్రజలు ప్రాణాలర్పించారని అటువంటి స్వాతంత్రయాన్ని యువతీ యువకులు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. భారతదేశంలో లౌకిక ప్రజాస్వామ్య భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.బాజీబాబు, ఐద్వా జిల్లా సభ్యులు ఎన్.ప్రశాంతి, ఎన్.నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రేమ కుమార్, హైస్కూలు హెచ్‌ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

బాలుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉయ్యూరు: ప్రమాదవశాత్తు కిందపడి చేతికి ఫ్రాక్చర్ అయిన బాలుడికి హోప్ హాస్పిటల్ అధినేత డాక్టర్ జాన్ డేవిడ్ ఉచితంగా చికిత్స చేసి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఉయ్యూరుకు చెందిన ఎడ్ల తిరుమల హర్ష మూడు సంవత్సరాలుగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటివద్ద ప్రమాదవశాత్తు జారిపడగా చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. బాలుడు త్వరగా కోలుకుని ఆరోగ్యవంతుడు కావాలని న్యాయవాది టి.చంటిబాబు, హాస్పిటల్ సిబ్బంది ఆకాంక్షించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని కెరియర్ గైడెన్స్‌లో విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగించుకోవడం భవిష్యత్తులో మంచి ఉద్యోగాన్ని సంపాదించడం తల్లిదండ్రులకు దేశానికి గర్వకారణంగా విద్యార్థులు ఎదగాలంటే మంచి చదువు నడవడిక అవసరమని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొలసార్ రవికుమార్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని ఉన్నత పాఠశాలలో మీరు మానవతా సంస్థ వాళ్ళు మంచి ప్రవర్తన కలిగిన అలవాట్లు చదువు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి రియాజ్ పినమాల నాగ కుమార్ కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల ఇచ్చాం ప్రభాకర్ రావు గ్రామ సర్పంచి వ్యాలో నాగమణి ఎంపీటీసీ సభ్యురాలు అంక కుమారి రాజ్యలక్ష్మి వైయస్సార్ పార్టీ నాయకులు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మ దేవస్థానంలో ముగిసిన టెండర్ల ప్రక్రియ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద శుక్రవారం వివిధ టెండర్ల ప్రక్రియ నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శేషం వీర వెంకట కష్ణమూర్తి, మచిలీపట్నం తనిఖీ అధికారి కె శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు పర్యవేక్షణలో టెండర్లు తెరిచారు. దసరా మహోత్సవలో లైటింగ్ ఏర్పాటు, వాటర్ ప్రూఫ్ షెడ్లు ఏర్పాటు, పూల అలంకరణ, నిత్య పూజా సామాగ్రి, అమ్మవారికి నూతన వస్త్రములు, ఫ్లెక్సీలు తదితర టెండర్లను ఖరారు చేశారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలనే సంకల్పంతో భారత ప్రభుత్వం అన్నీ తాపాల కార్యాలయాల్లో జాతీయ జెండాలను అందుబాటులో ఉన్నాయని మచిలీపట్నం డివిజన్ తపాల శాఖ సూపరింటెండెంట్ కె.ఆదినారాయణ తెలిపారు. తపాల శాఖ కార్యాలయ సిబ్బంది శుక్రవారం పట్టణం లో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆదినారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తపాల శాఖద్వారా ప్రజలందరికి రూ.25కే జాతీయ జెండాను అందజేస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి పోస్ట్‌మ్యాన్ స్వయం గా ఇంటికి తీసుకువచ్చి జెండాను ఇస్తారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటి పై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. జాతీయ జెండాను ప్రజలకు అందించే బాధ్యత భారత ప్రభుత్వం తపాల శాఖకు అప్పగించడం తపాలా శాఖకు గర్వకారణం అన్నారు. ఈ ర్యాలీలో మచిలీపట్నం అసిస్టెంట్ సూపరింటెండెంట్ టి.నాగరాజు, మచిలీపట్నం సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ ఎం.నాగరాజు, మచిలీపట్నం పోస్ట్‌మాస్టర్ కె.సుధాకర్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండలంలో మండల అధికారి కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వర్ణం మహా లక్ష్మయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, ఈ పంట నమోదు చేయించుకోవడం వలన పంట నష్టపరిహారాలు, ఇన్సూరెన్స్, పంట కొనుగోలు మొదలైన వాటికి ఉపయోగపడుతుందని చెప్పడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి వారు జీవి శివప్రసాద్ మాట్లాడుతూ ఈ పంట నమోదు చేయించుకునే ప్రతి రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించి సర్వే నెంబర్ ప్రకారం పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ వీరమాచనేని సౌమ్యకు మదర్ థెరిసా సేవారత్న పురస్కారం

అవార్డు అందుకున్న సౌమ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్యురాలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు డాక్టర్ వీరమాచనేని సౌమ్యకు అరుదైన ఖ్యాతి దక్కింది. నియోజకవర్గంలో తమదైన శైలిలో బొజ్జా డెంటల్ హాస్పిటల్స్ ద్వారా సేవలందిస్తున్న సౌమ్యకు మదర్ తెరిసా సేవా సమితి 2023 జాతీయ సేవారత్న పురస్కారాన్ని అందజేసింది. వైద్యురాలిగా, సామాజిక సేవకురాలిగా, నియోజకవర్గ ప్రజలకు కొండంత ధైర్యాన్ని కల్పిస్తూ నిజమైన రాజకీయ నాయకురాలిగా ఖ్యాతిగాంచిన సౌమ్యకు మదర్ థెరిసా సేవారత్న పురస్కారం అందజేస్తున్నట్లు మదర్ థెరిసా సేవా సమితి సభ్యులు తెలియజేశారు. ఈనెల 10న తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్‌లో గౌరవ సభ్యులచే పురస్కారం అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ తన జీవిత భాగసామి డాక్టర్ బొజ్జా రాజేష్ సహకారంతో బొజ్జా డెంటల్ ద్వారా వినూత్న రీతిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాలల పరిరక్షణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ప్రియాంక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గుంటుపల్లి సచివాలయ పారిశుధ్య కార్మికులకు బాలల పరిరక్షణపై అవగాహనా కార్యక్రమం శుక్రవారం గుంటుపల్లి సచివాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించుకుందాం, వారికీ రక్షణగా ఉందాం అన్నారు. బాలలు మరియు యువత మందు, సిగరెట్, గంజాయి, మొదలైన మత్తుపదార్థాలకి ఎక్కువగా అలవాటు పడటం అసాంఘిక కార్యకలాపాలకు దగ్గర అవ్వడం, చిన్న వయస్సు నుండే నేరప్రవత్తి కి అలవాటు పడటం, జీవితాన్ని మధ్యలోనే తెంచేయడం మొదలైన వాటిని మనం చూస్తూనే ఉంటాం, అని, విద్యార్థి దశ నుంచే సరి అయిన అవగాహన మనం ఇచ్చినట్లయితే వారు మత్తుపదార్థాలకు బానిసలూ కాకుండా వుంటారు, సమాజంలో మంచి పౌరులుగా వుంటారని మత్తు పదార్థాల వ్యసనం నుండి బైటకు తీసుకురావడానికి డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణస్థితికి.. తీసుకురావచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో గుంటుపల్లి సచివాలయ శానిటరీ సూపర్ వైజర్ టి దాసు, సచివాలయ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

దళితవాడలో 'భవిష్యత్తు గ్యారంటీ'

ప్రజాశక్తి - గంపలగూడెం: స్థానిక పడమట దళితవాడలో శుక్రవారం రాత్రి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి మాట్లాడుతూ, మహాశక్తితోనే ప్రజలకు భవిష్యత్తు గ్యారంటీ అన్నారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ మేనిఫెస్టో వివరాలను తెలియజేస్తూ, సంబంధిత కరపత్రాలు ప్రజలకు అందజేశారు. మరోసారి బాబును ఆదరించి ఈ రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలని కోరారు. స్థానిక సర్పంచ్ కోట పుల్లమ్మ సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు, కాజా రవికుమార్ పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ

నూతన వస్త్రాలను ఇస్తున్న వరప్రకాష్, దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు (శ్రీనన్న) జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం కార్మికులకు శ్రీనన్న దళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్ ఆధ్వర్యంలో నూతన వస్త్రములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థాన కమిటీ సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్ పాల్గొని నూతన వస్త్రాలు కార్మికులకు పంపిణీ చేశారు. శాంతిలాల్, నాయుడు, హరి, రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతిన వరప్రకాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనన్న దళం సభ్యులు సురా బత్తుల రాంబాబు, బంక రామచంద్రరావు, నక్క బాలాజీ, పండు, నాని, మనోజ్ ,పొట్నూరి దుర్గాప్రసాద్, లాల్, అడ్డకర్లహరి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పని చేయించాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి వర్యులు జోగి రమేష్‌కు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు బందం శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని మంత్రి నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు పోరాడి సంక్షేమ బోర్డును సాధించుకున్నారని. సంక్షేమ బోర్డు ద్వారా కొన్ని పథకాలు అమలు చేయించుకుంటున్నారని కానీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే పథకాలు సర్క్యులర్ నెం 1214ని విడుదల చేయడం ,బోర్డు నిధులను సైతం జీవో 17 విడుదల చేసి ఇతర పథకాలకు వాడుకున్నారని అన్నారు. దీనితో వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులు పథకాల కోసం దరఖాస్తు చేసుకొని పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారని పరిహారాలు రాకపోవడంతో ఆయా కుటుంబాల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులు 831 కోట్ల రూపాయలు వాడుకుందని, తిరిగి బోర్డులో తిరిగి జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి యం. మహేష్, మండల అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కె.వీరయ్య, కొండపల్లి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ ఆకుల నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నాడు జాతీయస్థాయి పోటీ పరీక్షలలో ఎలా విజయం అధిగమించాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ సిఎస్ఐఆర్- సిసిఎంబి రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ నిరాడి దినేష్ కుమార్ ఈ సమావేశంలో ముఖ్య వ్యాసకర్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీప్యాట్, నైపర్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే కఠోరమైన శ్రమతో పాటు, ఆ పరీక్షలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా ఒక ప్రణాళిక ప్రకారం సిద్ధమయ్యేలా కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. 200 మంది విద్యార్థులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జనార్ధన్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

గుడి కూల్చివేతపై ఆగ్రహం

నిరసన తెలియజేస్తున్న సిపిఎం తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపాలిటీ 18 వ వార్డు డివిఆర్ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం గుట్టు చప్పుడు కాకుండా మున్సిపల్ అధికారులు ప్రోక్లైన్‌తో ముత్యాలమ్మ గుడిని కూల్చివేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలియజేశారు. నందిగామ డివిఆర్ కాలనీలో 2000 పైగా జనాభా ఉన్నారు. సుమారు వెయ్యి కుటుంబాల వారు పేద ప్రజలు అంతా కలిసి విరాళాలు సేకరించి దేవాలయ స్థలంలో ముత్యాలమ్మ గుడి నిర్మించుకొని పూజలు చేస్తున్నారు. సదర స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ముత్యాలమ్మ గుడిని కూల్చివేశారు. దీంతో స్థానికులు ఆందోళనకు దిగారు. సిపిఎం ప్రజాసంఘాల నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. సిపిఎం నందిగామ మండల కార్యదర్శి కట్టారు గోపాల్ సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసింలు మాట్లాడుతూ కూల్చివేసిన గుడిని తిరిగి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, పుల్లయ్య గోపి నాయక్ పాల్గొన్నారు.

44వ డివిజన్లో వెలంపల్లి పర్యటన

44వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 44వ డివిజన్‌లో గల పలు ప్రజా సమస్యల పరిష్కారానికై శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అధికారులు నాయకులతో కలిసి విస్తతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా విడుదలైన నిధులతో డివిజన్‌లో అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కొండప్రాంతం మొత్తం నూతన వాటర్ పైపులైన్లు వెయ్యడం జరిగిందన్నారు. మెట్లమార్గాలు బాగుచేశామన్నారు. పెండింగులో ఉన్న అన్ని సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. నియోజకవర్గంలో అన్ని రోడ్లు అభివద్ధి చెయ్యాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. గతంలో టీడీపీ నియోజకవర్గ అభివద్ధిని గాలికి వదిలేశారన్నారు. పార్కులు రోడ్లు అన్ని మా హయాంలో అభివద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

జెసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి- నందిగామ : జెసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను నందిగామ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు గురువారం ఖండించారు. ఇటీవల కాలంలో ఇంటర్వ్యూ ఇచ్చిన జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులను కించపరిచేలా వ్యాఖ్యలను చేసి మంగలోడా అనే పదజాలంతో మాట్లాడిన తీరును నందిగామ నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అతనిపై చర్యలు తీసుకొని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్ఎ సుధీర్ రెడ్డికి సన్మానం

సుధీర్ రెడ్డిని సత్కరించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నందిగామ : తెలంగాణ రాష్ట్రానికి చెందిన హైదరాబాద్ ఎల్బీ నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు సుధీర్ రెడ్డిని శుక్రవారం నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్ రావు, ఎమ్మెల్సీ మొండితో కరుణ్ కుమార్ సన్మానించారు. విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి వెళ్లి వస్తూ నందిగామ పట్టణంలోని శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్ నివాసంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని తేనేటి విందు స్వీకరించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని సమకాలీన రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌తో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డినీ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టిఆర్ఎస్ నాయకులు నరసింహారెడ్డి, మీర్ పేట కార్పొరేటర్ ముద్ద పవన్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారాహి యాత్ర విజయవంతానికి జనసేన పూజలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మూడో విడత వారాహి యాత్ర విజయవంతం కావాలని, అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవ్వాలని కోరుతూ శుక్రవారం 40వ డివిజన్ జనసేనపార్టీ యాక్టివ్ మెంబర్‌షిప్ కోఆర్డినేటర్ ఎం.హనుమాన్ ఆధ్వర్యంలో దుర్గగుడి ఘాట్‌రోడ్‌లో ఉన్న కామధేను అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ప్రకాశం బ్యారేజ్ దగ్గర ఉన్న హుస్సేనిషా ఖాధరి దర్గాకి పాదయాత్రగా వెళ్లి డివిజన్ అధ్యక్షులు తమ్మిన లీలా కరుణాకర్, ఏలూరు సాయిశరత్, సింగెనం శెట్టి రాము గుప్తాలతో కలిసి చాదర్ సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మవారి ధార్మిక సేవ మండలి సభ్యులు తమ్మిన రఘు బాబు, రాళ్లపూడి గోవింద్, అడ్డగిరి పుల్లారావు, పులిచేరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల తరలింపును స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ గాంధీ సెంటర్లో రోడ్డు మధ్యలో ఉన్న విగ్రహాలను లీడర్స్ పార్క్ ఏర్పాటు చేసి తరలించడానికి స్వాగతిస్తున్నామని తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అధ్యక్షులు, ప్రముఖ హైకోర్టు, సుప్రీంకోర్టు- న్యాయవాది జై భీమ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వారు ఎక్కడైనా రోడ్డు మధ్యలో విగ్రహాలు కనుక నిర్మిస్తే, ప్రజలకు , వాహనాలకు రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నప్పుడు ట్రాఫిక్ జామ్ సమస్య ఉన్నప్పుడు , లీడర్ పార్కు ఏర్పాటు చేసి , విగ్రహాలు తరలించవలసిందిగా సుప్రీంకోర్టు వారు భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు ఆదేశించడం జరిగిందన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం రెడ్డిగూడెం మండలంలో నా భూమి నా దేశం కార్యక్రమం అన్నెరావు పేట, రెడ్డిగూడెం, నాగులూరు, పాత నాగులూరు పంచాయతీలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమరవీరులకు, స్వాతంత్ర్య సమరయోధులుకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి వై విష్ణు ప్రసాద్,ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్లు ఎం. రాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఫెర్రీ నుండి లాంచీ ప్రయాణం ప్రారంభం

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: కొన్ని సంవత్సరాలుగా అనివార్య కారణాల వలన నిలిచిపోయిన కష్ణా నదిలో లాంచీ ప్రయాణం ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమైంది. ఇబ్రహీంపట్నం నుండి రాయపూడి వరకు లాంచి రవాణా, ప్రయాణాలు కొనసాగడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో నదిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లైఫ్ జాకెట్లు, తప్పనిసరి ధరించాలని సూచిస్తూ నేటి నుండి లాంచి రవాణాను ప్రారంభించారు. లాంచీ సర్వీసులు ప్రతి గంటకు ఒకసారి అనగా ఉదయం 8:15కు మొదలై సాయంత్రం 6 గంటలకు ముగుస్తాయన్నారు. సర్వీసులను ఉపయోగించుకునే వారు సమయాన్ని పాటిస్తూ లాంచి నిర్వాహకులు సూచించిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తెలిపారు.

ఘనంగా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

వేడుకలను ప్రారంభిస్తున్న రత్నబాబు, ఈశ్వరరెడ్డి తదితరులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల 25 విద్యా వసంతాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ భాగంగా రెండు రోజుల పాటు ఇండియన్ సొసైటీ ఫల్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఐఎస్‌టిఇ వారి సౌజన్యంతో ఎఎస్‌టిఇ స్టేట్ లెవెల్ స్టూడెండ్ కన్వెన్షన్ మరియు అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్టేట్ లెవెల్ స్టూడెంట్ కన్వెన్మన్, సాంప్రదాయ నత్యం, ప్రార్థనా గీతంతో కార్యక్రమాలను ప్రారంభించారు. జిఎస్ఎన్ఎల్ సీనియర్ జనరల్ మేనేజరు ఎం.రత్నబాబు, విఎస్‌టిఇఎసి సెక్షన్ సెక్రటరి మరియు కోశాధికారి (ట్రెజరర్) ప్రొఫెసర్ జె.ఎన్.టి.యు అనంతపురం బి.ఈశ్వరరెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. 1998వ సంవత్సరంలో 180 సీట్లతో స్థాపించబడి, 2008లోనే ప్రముఖ ఎన్.జి.ఎ, న్యాక్ వారి ఆమోదంతో 2014వ అటానమస్(స్వతంత్ర) అక్షతను సంపాదించుకున్న ఈ ఎస్.ఆర్.జి.ఇ.సి కళాశాల స్థాపననే ఆలోచన, 1981 లో ఏ.ఏ.ఎన్.ఎమ్ మరియు వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఎడ్యుకేషనల్ స్ఫొటి పరిధిలో పాఠశాల, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను స్థాపించాలని అడుసుమిల్లి అశ్వద్ధ నారాయణమూర్తి మరియు వల్లూరు పల్లి రామ శేషాద్రిరావులు భవిష్యతు ఆలోచన వెలువడిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎస్.ఎన్. ఆర్.వి. ప్రసాద్ అభిప్రాయపడ్డారు. కళాశాల చైర్మన్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏడాది పాటు జరుగుతున్న ఈ సిల్వర్ జూబిలీ సెలెబ్రేషన్స్ వేడకలు ఫిబ్రవరి 2024లో 16, 17, 18వ జరగనున్న సాంకేతిక, సాహిత్య మరియు సాంస్కతిక కార్యక్రమాలలో ముగుస్తాయని ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచే విద్యార్థిన విద్యార్థులకు "జిఇసి రత్నాలు" బిరుదులతో పాటు బహుమతులు కూడా ఉంటాయనీ, విద్యతో పాటు ఇతర రంగాలలో కూడా అ అభ్యుదయ రావాలా దిశలో అడుగులు వేయాలని అభిప్రాయపడ్డారు. ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ మానవ తెలివితేటలతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త వరవడి సాధ్యపడుతున్నాయని, కావున మానవ మేధస్సు కాదని, ఇదంతా మానవ సష్టియేనని, కావున మానవున్ని నైపుణాన్ని పెంచే దిశలో పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. రత్నబాబు ప్రసంగిస్తూ విద్యార్థినీ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల్లో ముఖ్యమైనవి నిరుద్యోగ యువత, అనిశ్చిత భవిష్యత్తు, అనాలోచిత భవితవ్యం, స్పష్టత లేని జీవన ప్రగతి, పోటీ ప్రపంచంలో ఒడిదుడుకులు ఎదుర్కొనే శక్తి వంటి విషయాలపై చర్చించారు. సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్ సాంకేతిక కోఆర్డినేటర్ డాక్టర్ ఎం కామరాజు మాట్లాడుతూ మొత్తం 296 విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ నుండి 10 పాలిటెక్నిక్, 15 ఇంజినీరింగ్ కళాశాల నుండి నమోదయాయని, కళాశాల ప్రాంతంలో వివిధ వేదికల్లో సాంకేతిక పత్రాల సమర్పణ, సాంకేతిక పోస్టర్స్ ప్రదర్శన, సాధారణ సమకాలిన విషయాలపై ప్రశ్నావళి నిర్వహించేందుకు సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరు పల్లి నాగేశ్వరరావు, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి రవీంద్రబాబు, డైరెక్టర్ డాక్టర్ బి కరుణ కుమార్. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి కోదండ రామారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రావి

అధికార పార్టీ ఏజెంట్‌గా నందివాడ ఎస్ఐ : రావి

ప్రజాశక్తి-గుడివాడ: నందివాడ ఎస్ఐ అధికార పార్టీ ఏజెంటుగా వ్యవహరించడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వెంకటరాఘవపురం(రామపురం) సర్పంచ్ కాకరాల సుభాష్‌చంద్రబోసు(సురేష)తో కలసి అయన విలేకర్లతో మాట్లాడుతూ నందివాడ మండలంలోని రామపురంలో సర్పంచ్ కాకర్ల సురేష్ అధ్వర్యంలో రైతుల వితరణతో జరుగుతున్న శ్మశాన వాటికి పనుల విషయంలో వైసీపికి చెందిన వేరే గ్రామానికి చెందిన వ్యక్తి ఇరిగేషన్ సిబ్బందితో వచ్చి పనులు అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై సురేష్ తమ గ్రామంలో జరుగుతున్న పనులపై మీ పెత్తనం ఏమిటని ప్రశ్నిచడంతో అయనపై దాడికి తెగబడం జరిగిందన్నారు. ఈ విషయమై నందివాడ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారి కేసును తీసుకోకుండా ఎస్ఐ వేరే గ్రామం నుండి వచ్చిన వ్యక్తులకు సపోర్టు చేయడం బాధాకరమన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, అట్లూరి హనుమశేఖర్, అట్లూరి లీలాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో.. 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విగన్నవరం, మర్లపాలెం, చిన్న అవుటపల్లి, దావాజీగూడెం, అల్లాపురం, దుర్గాపురం, బీబీ గూడెం, గొల్లనపల్లి, చిక్కవరం ఇండస్ట్రీస్ ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-ఉంగటూరు (గన్నవరం): ఉంగుటూరు మండలములోని గారపాడు , తుట్టగుంట, ఎన్ఎపేట , తేలప్రోలు గ్రామాల్లో వార్డు సభ్యుల ఉప ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ పూర్తయినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. గారపాడు 8వ వార్డుకు ఎవ్వరూ నామినేషన్ దాఖలు చేయలేదు. తుట్టగుంట 5వ వార్డుకు బండి నాగేశ్వరమ్మ, 4వ వార్డు కు కొల్లి రవికుమార్ నామినేషన్ వేయగా సింగల్ నామినేషన్ కావడంతో ఏకగ్రీవం అయినట్లు ఆయన తెలిపారు. తేలప్రోలు 4వ వార్డు కు గుల్లిపల్లి సందీప్, గాదిరెడ్డి మోహన్ రెడ్డి, గుదిబండ రామ కోటి రెడ్డి, వింత శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేశారు.

కరాటేలో జశ్వంత్ ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల విశాఖపట్నంలో సర్వ భారతీ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర 21వ స్టేట్‌లెవల్ కరాటే చాంపియన్ షిప్‌లో గుడివాడ కెకె ఆర్ గౌతమ్ విద్యార్థి బి.జశ్వంత్ 13 సంవత్సరాల బాలుర వ్యక్తిగత కుమితే విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి సౌత్ ఇండియా పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమని ప్రిన్సిపల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనా అన్నారు. శుక్రవారం స్కూల్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. జశ్వంత్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏకరూప పౌర సంస్కృతి సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ

దేశంలో బిజెపి అనుసరిస్తున్న ఉమ్మడి పౌరసత్వం అనేది సరైనది కాదని సిపిఎం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రఘు తీవ్రంగా ఖండించారు. స్థానిక ఎన్జీవో హోంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రఘు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీ సర్కార్ చాలా దుర్మార్గంగా ఉమ్మడి పౌరస్మృతి విధానాన్ని అమలు చేయడానికి రంగం సిద్ధం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉమ్మడి పౌరసత్వాన్ని మనందరం తిప్పికొట్టే దిశలో పయనించాలని చెప్పారు. వాస్తవంగా ఉమ్మడి పౌర స్మృతి అనేది భారతదేశంలోని అసమానతలు అంటే అది కులాల మధ్య, స్త్రీ పురుషుల మధ్య ఉమ్మడి పౌరస్మృతి అనేది అసాధ్యమైన విషయం అన్నారు. నిజమైన ఉమ్మడి పౌరస్మృతి అంటే చట్టాల్లో ఉన్న వాస్తవిక సమాజంలో ఉన్న ఈ అసమానతలను అన్నీ కూడా అంతం చేయాలన్నారు. కానీ ఇవేమీ చేయకుండా ఈ అసమానతల జోలికి పోకుండా యూనిఫామ్ సివిల్ కోడ్ అంటే ఒక పార్శిస్టు రాజ్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా గిరిజనులను క్రైస్తవులను సిక్కులను ఇటువంటి మతస్తులందరికీ మీ జోలికి రామని చెప్తున్నారు కానీ ముస్లిం మతం, ముస్లిం మత ఆచారాల మీద వాళ్ల టార్గెట్ ఉందని అర్థం అవుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు బిజెపి అవలంబించే పౌర స్మృతిని తిప్పి కొట్టే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌సిపి రెడ్డి, యుటిఎఫ్ కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షులు నీలం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు తవ్వకాన్ని ఆపాలని నిరసన

ప్రజాశక్తి-గుడివాడ: భూ పెత్తందారులకు అధికారులు కొమ్ముకాస్తున్నారని సిపిఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రఘు విమర్శించారు. నందివాడ మండలంలోని అంకన్నగుడెం దళితుల నివాసాల మధ్య అక్రమంగా తవ్వుతున్న చేపల చెరువును వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్‌డివో కార్యాలయం వద్ద సిపిఎం అధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ తమిరిశ శివారు గ్రామమైన అంకన్న గూడెంలో అక్రమ చేపల చెరువు తవ్వకం వల్ల ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చేపల చెరువుల ఊటదిగి తాగడానికి మంచినీరు లేక అనేక రోగాలకు గురవుతున్నారన్నారు. నివాస స్థలాల చుట్టూ రెండు పంటలు పండే సుమారు 36 ఎకరాల భూమి ఉంటే దానిని చేపల చెరువుగా మార్చడానికి అధికారులు అనుమతులు ఇవ్వడం దారుణం అన్నారు. చేపల చెరువు సాగులోకి వస్తే తాము కట్టుకున్న ఇల్లు ఎందుకు పనికిరాన్నారు. ఈ చేపల చెరువుల తవ్వకాన్ని ఆపాలని అనేకసార్లు కలెక్టర్‌కు, మత్స్యశాఖ జెడి, ఈడి ఎఫ్డిఓ ఆర్డిఓలకు గ్రామపంచాయతీలకు అనేకసార్లు వినతి పత్రాలు అందజేశామన్నారు భూస్వాములు చెరువులు తవ్వకానికి అధికారులు అనుమతించడం చాలా దారుణం అన్నారు. వెంటనే అధికారులు చెరువు తవ్వకాలను నిలుపుదల చేయాలని లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చారించారు అనంతరం ఆర్‌డివోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపి రెడ్డి, దళిత నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-మొవ్వ: 2023-24 విద్యా సంవత్సరంలో నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు దాఖలు చేయించాలని ఆయా పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు చేరాయి. ఆన్లైన్లో దరఖాస్తు సెప్టెంబర్ 16వ తేదీ లోపు దాఖలు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వివరించారు. డిసెంబరు మూడవ తారీఖున జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ ప్రధాన కేంద్రాల్లోని ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు 8వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని చేశారు. ఈ పరీక్షలు రాయటానికి జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత, ఎయిడెడ్, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలలో చదివే 8వ తరగతి విద్యార్థులు అర్హులుగా నోటిఫికేషన్ లో వివరించారు. దీనికి కుటుంబ వార్షికఆదాయంరూ.3.50 లక్షల లోపు వారే అర్హులన్నారు. అదేవిధంగా జనరల్, బీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు 100 రూపాయలు కాగా ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 50 రూపాయలు అని నోటిఫికేషన్ లో పేర్కొన్నారు.

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి-గుడివాడ : వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో బిసిల సత్తా ఏంటో వచ్చే చూపిస్తామని టిడిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు నెరుసు కాశీ అన్నారు. శుక్రవారం స్థానిక కాకర్లవీధిలొని పాత సంతబజార్‌లోని సర్దార్ గౌతులచ్చులన్న విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణిలతో కలసి కాశీ మాట్లాడుతూ టిడిపి హయాంలో టిటిడి చైర్మన్లుగా బీసీలకు అవకాశం ఇచ్చిన చంద్రబాబుకు బిసిలు ఎప్పుడూ రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిసి సెల్ అధ్యక్షుడు అంగడాల శ్రీనివాసరావు, నాయకులు రామదేణు వేణు, డా॥ యర్లగడ్డ ప్రసాద్, మజ్జాడ నాగరాజు, కుందేటి ప్రసాద్, సిహెచ్ దామోదర్, దేవేద్రుడు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం : జెసి

ప్రజాశక్తి - విజయవాడ : వినియోగదారుల హక్కులు, బాధ్యతలను విద్యార్థి దశలోనే వారికి అవగాహన కలిగిస్తే భవిష్యత్తులో వారు ఉత్తమ వినియోగదారులుగా తయారవుతారని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, కన్స్యూమర్ క్లబ్ ఆవశ్యకత తదితర అంశాలపై విద్యార్థుల్లో అవగాహన తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఫోరం ఫర్ అస్సెర్టింగ్ సర్వీస్ యూజర్స్ అధ్యక్షులు కెఎస్.కృష్ణమోహన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్‌బాబు, విజయవాడ సహాయ సరఫరాల అధికారులు, సివిల్‌సప్లై డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు

పొదుపు సంఘాలను నిలబెట్టిన ఘనత మాదే

జగనన్న ప్రభుత్వ హయాంలో కష్ణాజిల్లావ్యాప్తంగా 35, 752 స్వయం సహాయక సంఘాల్లోని 3,77,347 మంది అక్క చెల్లెమ్మలకు రూ.46.02 కోట్లు పంపిణీ చేశారని తెలిపారు. కేవలం అవనిగడ్డ నియోజకవర్గంలోనే 6,095 స్వయం సహాయక సంఘాల్లోని 65,391 మంది సభ్యులకు రూ.7.10 కోట్లు అందజేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హతగల 9.48 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని కోటి 5 లక్షల 13 వేల 365 మంది అక్కచెల్లెమ్మల బ్యాంకులకు నగదు జమ చేసినట్లు తెలిపారు. అలాగే రూ.1,353.76 కోట్ల వడ్డీని రీయింబర్స్ చేస్తూ వారి తరపున అదే అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి బటన్ నొక్కి నేరుగా జమ చేశారని తెలిపారు. తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని మంత్రి రోజా అన్నారు. ఇప్పుడు అందిస్తున్న రూ.1,353.76 కోట్లతో కలిపి 'వైఎస్సార్ సున్నావడ్డీ' కింద అందించిన మొత్తం సాయం రూ.4,969.05 కోట్లుగా ఉందని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కోట్లాదిమంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉంటారనే నమ్మకం తనకుందని మంత్రి రోజా విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా, తద్వారా వారి జీవనోపాధి మెరుగుపడేలా జగనన్న ప్రభుత్వం విప్లవాత్మకమైన పరిపాలన అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కెడిసిసి బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, రైతు విభాగం జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావు, అవనిగడ్డ సర్పంచ్ గొర్రుముచ్చు ఉమ, ఎంపిపి తుంగల సుమలీదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, డిఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఆర్డీఓ ఐ.కిషోర్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పిఎస్ఆర్ ప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : కలెక్టర్ డిల్లీరావు

సహాయం చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాలలోని మహిళలకు వడ్డీ భారం పడకుండా ప్రభుత్వమే వడ్డీ సొమ్మును పొదుపు సంఘాల ఖాతాలకు జమ చేయడం మహిళల ఆర్థిక ప్రయోజనానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎంఎల్ఎ మల్లాది విష్ణు వర్ధన్, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు, విశ్వ బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, బట్రాజ్ కార్పొరేషన్ చైర్మన్ గీతాంజలి దేవి, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, ఏపీ సివిల్ సప్లై డైరెక్టర్ చంద్ర శేఖర్, లిడ్ క్యాప్ డైరెక్టర్ ఝాన్సీ రాణి, దుర్గ గుడి పాలకమండలి సభ్యులు బి.మాధవి కృష్ణ, కార్పొరేటర్ సీరం శెట్టి పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా ఉండాలి

బిఎల్‌ఓలకు విఎంసి కమిషనర్ దినకర్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : పారదర్శక ఓటర్ల జాబితాల తయారీకి సమగ్రంగా డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేయడం అత్యంత కీలకమని, దీనిని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ) విధిగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని గుణదల 3వ డివిజన్ క్రీస్తురాజపురం బెత్లహెంనగర్‌లో శుక్రవారం బిఎల్వో యాప్ ద్వారా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పనిని ఆయన స్వయంగా పరిశీలించారు. బిఎల్ఒలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటి వాటికి ఫారం-6, 6ఎ, 7, 8 ఫారాలను అందించి దరఖాస్తులను స్వీకరించాలని, మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కుటుంబంలో అందరి ఓట్లు ఒకేచోట ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా జూలై 21 నుండి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు డోర్ టు డోర్ వెరిఫికేషన్ ద్వారా ఓటర్ల జాబితాను పరిశీలిస్తారన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ బూత్లో తగిన కారణాలను పరిశీలించి ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బిఎల్వోలు...ఓటర్ జాబితా పరిశీలనలో డబుల్ ఎంట్రీలు,

బిఎల్‌ఒలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

నకిలీ ఓటర్ల గుర్తింపు, మరణించిన ఓటర్ల తొలగింపు, 100 సంవత్సరాలు నిండిన వారి గుర్తింపు, డోర్ నెంబర్ లేకపోయిన, ఒకే డోర్ నెంబర్లు అధిక సంఖ్యలో ఉన్న ఓటర్ల పరిశీలన, సర్వీసు ఓటర్లు, ఎన్ఆర్ ఓటర్ల వివరాలు సరిచేయడం, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓటర్లను వారి అనుమతితో ఏ నియోజకవర్గంలో ఉంచాలో తెలుసుకుని జాబితాలో ఉంచడం చేయాలన్నారు. ఒక బూత్లో 1500 ఓటర్లకు మించి గుర్తిస్తే కొత్త బూతకు సిఫార్సు చేయడం, ఫోటో ఓటర్ గుర్తింపు కార్డులలో మార్పులు చేర్పులు, తప్పొప్పులు సరిచేయడం ప్రధానంగా నిర్వహించాలన్నారు. బిఎల్వోల ఓటర్ల జాబితా పరిశీలనను ఎఇఆర్వోలుగా ఉన్న సంబంధిత మండల తహశీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, సూపర్వైజర్లు, అధికారులు, బిఎల్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పాడి రైతు లబ్ధిదారులను నమోదు చేయాలి

జెసి సంపత్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : జగనన్న పాలవెల్లువలో వైఎస్ఆర్ చేయూత మహిళా పాడి రైతు లబ్ధిదారులను నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జగనన్న పాలవెల్లువపై శుక్రవారం నగరంలోని జాయింట్ కలెక్టర్ విడిది కార్యాలయం నుండి యంపిడివోలు, డిఆర్‌డిఏ, పశు సంవర్ధక శాఖాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా మహిళా పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలనే ధ్యేయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న పాల వెల్లువ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. అధికారులు సమన్వయంతో ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి జిల్లాను జగనన్న పాల వెల్లువ పథకంలో అగ్రగామిగా నిలపాలని అన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో మహిళా పాడి లబ్ధిదారులకు పాడి గెదలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మంజూరు చేసినట్లు చెప్పారు. ఆయా లబ్ధిదారులను జగనన్న పాలవెల్లువ పథకంలో భాగస్వామ్యులు చేసేలా వాలంటీర్లు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. జిల్లాలోని జి కొండూరు, మైలవరం, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఏ కొండూరు మండలాలలో జగనన్న పాలవెల్లువ పథకం అమలు జరుగుతోందన్నారు. ఈ మండలాలలో 15,476 మంది మహిళా పాడి రైతులు నమోదై ఉన్నారని, వీరిలో 6,000 మంది మహిళా పాడి రైతులు మాత్రమే పాలను కేంద్రాలలో సరఫరా చేస్తున్నారని, మిగిలిన వారు పాలను సరఫరా చేయకపోవడానికి గల కారణాలను తెలుసుకుని సరఫరాలో ఎదైన సమస్య ఎదురైతే వాటిని పరిష్కరించి పాలను సరఫరా చేసేలా ప్రోత్సహించాలని అన్నారు. జగనన్న పాలవెల్లువ ప్రారంభం నాటి నుండి నేటి వరకు 20 లక్షల లీటర్లకు పైగా పాల సేకరణ జరిగిందన్నారు. అయితే కొన్ని మండలాలలో పాల సేకరణ ఆశించిన స్థాయిలో లేదని, సంబంధిత ప్రమోటర్లు దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం నుండి రోజుకు 50 నుండి 100 లీటర్లు పాల సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై గ్రామ మండల టీమ్‌లు, మహిళా పాడి రైతులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పాల సేకరణపై ప్రతి వారం సమీక్షించుకుని తక్కువ పాల సేకరణ జరిగే కేంద్రాలలో తగిన కారణాలను సమీక్షించుకోవాలని జెసి అధికారులను ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాసరావు, పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డా కె.విద్యా సాగర్, తిరువూరు ఆర్‌డివో వైవి ప్రసన్న లక్ష్మి, ఏపిడిడిసిఎఫ్ సైదులు, జిల్లా సహకార శాఖ అధికారి సిహెచ్ శైలజ, నోడల్ ఆఫీసర్ డా. కృష్ణమూర్తి, అమూల్ డైరి ప్రతినిధి ధీరజ్, సంబంధిత మండలాల యంపిడివోలు, తహశీల్దారు, ఏపియంఏలు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసు సిబ్బంది

తోటి కానిస్టేబుల్ కుమారుడి వైద్యం కోసం సాయం

ప్రజాశక్తి - విజయవాడ : తమ తోటి కానిస్టేబుల్ కుమారుడి ఆరోగ్యంపై ఎన్‌టిఆర్ జిల్లా సౌత్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిటీ ఆర్మడ్ రిజర్వుడ్ విభాగంలో పనిచేస్తున్న ఎ.ఆర్ కానిస్టేబుల్ 2632 డి.రాజ్ కుమార్ కుమారుడు భరద్వాజ్ గత కొంత కాలంగా తలసేమియాతో బాధపడుతూ చెన్నై రేలా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది. ఇప్పటివరకు తన కుమారుడి వైద్యం కోసం తండ్రి రాజ్‌కుమార్ ఎక్కువ మొత్తంలో డబ్బు ఖర్చు చేశాడు. కుమారుడి ఆరోగ్యం కోసం చేస్తున్న ప్రయత్నాన్ని గమనించిన సౌత్ డివిజన్ ఏసిపి డాక్టర్ రవికిరణ్, పోలీస్

చెక్కు అందిస్తున్న రూరల్ డిసిపి అజిత వేజెండ్ల

అధికారులు, సిబ్బంది కలిసి మానవతా దృక్పథంలో రూ.3.25 లక్షల నగదును పోగు చేసి శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా, రూరల్ డిసిపి అజిత వేజెండ్ల, సౌత్ జోన్ ఏసిపి డాక్టర్ డాక్టర్ రవికిరణ్ చేతులు మీదగా కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు చెక్కు రూపంలో అందజేశారు. తనకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ ఎఆర్ కానిస్టేబుల్ డి.రాజ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

అంబటి నోరు అదుపులో పెట్టుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : టిడిపి యువ నేత నారా లోకేష్ మీద అవాకులు చెవాకులు పేలుతున్న అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెండ్యర్తి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో ఘాటుగా విమర్శించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. అంబటి రాంబాబు 1994,1999,2014లో మూడు సార్లు టిడిపి చేతిలో ఓడిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి అయినంత మాత్రాన అంబటి గొప్ప రాజకీయ నాయకుడనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రిగా చేసిన టిడిపి యువనేత నారా లోకేష్‌పై అవాకులు, చవాకులు మాట్లడటం మానుకోవాలని హితవు పలికారు.

15న 'జయహో భారత్'పై చిత్రలేఖనం

ప్రజాశక్తి-విజయవాడ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా "జయహో భారత్" అనే అంశంపై (చిత్రలేఖనం పోటీలు) ఆర్ట్ కాంటెస్ట్‌ను మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించడం జరుగుతుందని ఈవెంట్ కన్వీనర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు పోటీలు జరుగుతాయని, అనంతరం సాయంత్రం 5 గంటలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఎంజిరోడ్డు, రాఘవయ్యపార్కు ఎదురుగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలోని మూడవ అంతస్తులో ఈ పోటీలు జరుగుతాయని, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బహుమతి ప్రధానోత్సవం ఎంబివికెలోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో జరుగుతాయని అన్నారు. 1,2,3 తరగతుల విద్యార్థులు సబ్‌జూనియర్స్‌గా, 4,5,6 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గా, 7,8,9 తరగతుల విద్యార్థులు సీనియర్స్‌గా గ్రూప్సును తయారు చేయడం జరిగిందన్నారు. సబ్ జూనియర్స్‌కు జాతీయ పతాకానికి శాల్యూట్ అనే అంశంపై, అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అనే అంశంపై జూనియర్స్‌కు, నేను కలలుగన్న నాదేశం అనే అంశంపై సీనియర్స్‌కు పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 14 లోపులో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికిఆఖరు తేదీ అని అన్నారు. 1 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని, విద్యార్థులు వారికి నచ్చిన ఏ మీడియంలోనైనా చిత్రాలు గీయవచ్చు. వివరాల కోసం...ఈ వెంట్ కన్వీనర్లు ...సునీల్‌కుమార్ 7799308775, స్ఫూర్తి శ్రీనివాస్ 7981435393, మల్లిక్: 8801104107 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలుసుకోవచ్చునని నిర్వాహకులు కోరారు.

'డయల్ యువర్ పోలీస్ కమిషనర్' 10 ఫిర్యాదులు

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించడానికి ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్ఒలు చర్యలు తీసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతిరాణా టాటా ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి శుక్రవారం డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్‌కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమిషనర్‌కు వివరించారు. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తుల కార్యకలాపాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాల తదితర విషయాలపై మొత్తం 10 ఫోన్ కాల్స్ వచ్చాయి. అనంతరం పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడారు. ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి

ఎన్టీఆర్ జిల్లా, వత్సవాయి మండలం, మక్కపేట గ్రామానికి చెందిన కందిమల్ల రాజేష్ సన్నాఫ్ రమేష్ అను నా ఇంటర్మీడియట్ ఒరిజినల్ టి.సి, మార్కుల మెమో, స్టడీ, కాండాక్ట్ సర్టిఫికెట్లు ఇంటి వద్ద నుండి వత్సవాయి వెళ్తుండగా మార్గమధ్యలో పోయినవి. పై సర్టిఫికెట్లు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు తెచ్చి ఇవ్వగలరు.

ఇట్లు,
కందిమల్ల రాజేష్, సన్నాఫ్ రమేష్,
మక్కపేట గ్రామం,
వత్సవాయి మండలం, ఎన్టీఆర్ జిల్లా,
సెల్ నెంబర్ 9391177341

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
శనివారం 12 ఆగస్టు 2023

వైద్యురాలి హత్య కేసులో భర్తే నిందితుడు : ఎస్‌పి

వివరాలు తెలియజేస్తున్న ఎస్‌పి జాషువా

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్: మచిలీపట్నంలో మహిళా డాక్టర్ మాచర్ల రాధా హత్య కేసులో భర్త మాచర్ల లోకనాథ మహేశ్వరరావు, డ్రైవర్ స్ఫూర్తి జనార్ధన్ అలియాస్ మధు హంతకులుగా తేలిందని జిల్లా ఎస్పీ పి జాషువా తెలిపారు. జూలై 25వ తేదీ స్థానిక జవ్వారిపేటలోని వెంకటేశ్వర తల్లిపిల్లల వైద్యశాల గైనకాలజిస్ట్ డాక్టర్ మాచర్ల రాధా హత్య కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి మీడియాకు తెలిపారు. రాధా, భర్త మహేశ్వరరావు తల్లీపిల్లల వైద్యశాలను స్థానికంగా చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. ఇద్దరు పిల్లలకు వివాహం జరిపించారు. కొంత కాలంగా వ్యక్తిగత, ఆస్తి సంబంధిత వ్యవహారాల్లో భార్యాభర్తల మధ్య విభేదాలు తీవ్రమవటంతో భార్యను ఎలాగైనా తుదముట్టించాలని నిర్ణయించుకున్నాడు. మూడు నెలలుగా భార్యను హత్య చేయాలని ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడన్నారు. హత్యకు ముందు నుండి భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదాలు జరగుతుండటం, ఆస్తి సంబంధిత వ్యవహారాలను మహేశ్వరరావు తరచుగా ప్రస్తావించటం, ఆమె తీవ్రంగా విభేదించడంతో డ్రైవర్ జనార్ధన్ మధు సహాయంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రణాళిక ప్రకారం ఇంట్లో ఉన్న వైద్యురాలిని డ్రైవర్ గట్టిగా పట్టుకోగా భర్త ఇనపరెంచుతో ఆమె తలపై పాశవికంగా దాడి చేశాడు. మతురాలి ఒంటిపై ఉన్న బంగారు గాజులు, బంగారు గొలుసు, బంగారు మంగళ సూత్రంలను ఇద్దరూ కలిసి తస్కరించి అదే ఆసుపత్రిలోని రహస్య ప్రదేశంలో దాచారు. నిందితులు పోలీసులకు ఫోన్ చేసి ఎవరో హంతకులు హత్య చేసి బంగారం దోచుకెళ్ళారని ఫిర్యాదు చేశారని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన బందరు డిఎస్పి మాధవరెడ్డి, ఇనగుదురు ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర రావు, ఎస్ఐ ఫిరోజ్, మాణిక్యమ్మ, సాంకేతికంగా పనిచేసిన సిబ్బందిని అభినందించారు.

జలదీశ్వర ఆలయంలో నైషిత నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి-ఘంటసాల: ప్రపంచవ్యాప్తంగా కూచిపూడి నాట్యంలో దాదాపు 100 కి పైగా ప్రదర్శనలు ఇచ్చిన దుబాయ్ నివాసి పశ్చిమ గోదావరి జిల్లా కొణికి గ్రామానికి చెందిన నైషిత గుండపనేని శుక్రవారం ఘంటసాల లోని జలదీశ్వర ఆలయాన్ని వచ్చి స్వామివారి దర్శనం చేసుకుని ఆలయ ప్రాంగణంలో నత్య ప్రదర్శన చేశారు. నైషిత గతంలో కూచిపూడి నాట్య ప్రదర్శన వేదిక మీద గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించింది. ఈ సందర్భంగా నైషిత మాట్లాడుతూ జలధీశ్వరాలయం లో నత్య ప్రదర్శన చేయాలనేది తన కల అని అది నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. నైషిత తండ్రి శశి కుమార్ దుబాయ్ లో ప్రభుత్వ వైద్యుడు గా పని చేస్తున్నారు. కరోనా సమయంలో అక్కడున్న తెలుగువారికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. అంతే కాకుండా ఆన్లైన్ ద్వారా ఇండియా లో ఉన్న పలు కరోనా బాధితులకు ధైర్యాన్నిచ్చి వారి ప్రాణాలను కాపాడారు. నైషిత తల్లి రాజీష

తమ కుమార్తె కు ఉన్న ఆసక్తి ని గమనించి చిన్నపటినుండి కూచిపూడి నత్యంలో శిక్షణ ఇప్పించారు. వీరిని ఘంటసాల డాట్ నెట్ నిర్వాహకులు వేమూరి రాజేష్ భార్గవి దంపతులు సత్కరించారు. ప్రదర్శన అనంతరం కృష్ణా జిల్లా మాజీ జెడ్పి వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ, గొర్రెపాటి మధు, సురేంద్ర, రామకష్ణ, వేమూరి ప్రవీణ్, వేమూరి రామచంద్రరావు, అయినపూడి విజయకుమార్ జ్ఞాపికతో సత్కరించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఎండుతున్న పంటలు : టిడిపి

ప్రజాశక్తి-కోడూరు: వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే నేడు నారుమడులు ఎండుతున్నాయని సాగు చేసేందుకు నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం కోడూరు శివారు జరుగువానిపాలెం,పాతరెడ్డిపాలెం గ్రామాల సమీపంలో ఉన్న 5వ నెంబర్ పంట కాలువ క్రింద ఎండుతున్న నారుమడులను స్థానిక టిడిపి నేతలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాగాయలంక నుంచి మందపాకల వచ్చు పంట కాలవ నుంచి చిలిన (సబ్ బ్రాంచ్) 5 నెంబర్ కాలువ వెంబడి దిగువకు చుక్కనీరు కూడా రావటం లేదన్నారు. గత కొద్ది రోజుల క్రితం వరద వచ్చినప్పుడు ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని దిగువకు విడుదల చేసేటప్పుడు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే రైతులకు ఈ పరిస్థితి ఎదురయిందన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు స్పందించి 5 నెంబర్ కాలువకు నీటిని విడుదల చేసి ఎండుతున్న నారుమడులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మద్దూరి కాంతారావు, టిడిపి నాయకులు పిల్లి మల్లికార్జున రావు, అప్పికట్ల రవీంద్ర, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నమోదుకు ఈ బుకింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి-చల్లపల్లి: పంట నమోదుకు ఈ బుకింగ్ తప్పనిసరి అని వ్యవసాయ అధికారిణి ఏన్. పద్మావతి రైతులకు తెలిపారు శుక్రవారం మండల ప్రతినిధి పాగోలలో పంట నమోదు ప్రక్రియ పర్యవేక్షణ నిమిత్తం పంట పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు ప్రక్రియ ద్వారా రైతులకు పథకాలపై ఆమె రైతులకు వివరించారు. ధాన్యం కొనుగోలు, పంట బీమా, ఇన్ ఫుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, పంట రుణాలు రైతులకు ఈ పథకం ద్వారా అందుతాయని తెలిపారు. ఈ పంట నమోదు కారణంగారైతుల వివరాలు, పంట సాగు వివరాలు తెలుస్తాయని వివరించారు ఎంత ప్రాముఖ్యత గల ఈ పంట నమోదును రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులు వద్ద ఆధార్ కార్డు జిరాక్స్,పొలం పాస్ పుస్తకం జిరాక్స్, పంట రకం మొదలగు వివరాలను నమో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖ అధికారిణి సాయి సింధు రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-బంటుమిల్లి: మణిపూర్‌లో జరిగిన దాడులను ఖండిస్తూ శుక్రవారం బంటుమిల్లి రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు, సిపిఎం, క్రైస్తవులు, హిందువులు ముస్లింలు మ్మార్వో మొరల సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ గోష్, సిఐటియు కార్యదర్శి ధనశ్రీ, వైసిపి నాయకులు మళ్ళీ శెట్టి రాజబాబు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాలడుగు బాబురావు, బంటుమిల్లి వైస్ ఎంపీపీ వడిమి చిన్నారి బాబు, సుజ్ఞానం మహేష్, పాస్టర్లు తోట జాషువా కుర్తి వెన్ను పాస్టర్ దానియేలు, సుధాకర్, ఏసుబాబు, శ్యాం బాబు, ఏఐసిసి ప్రభుదాస్, ఎస్.కె భాషిద్, ఎంపీటీసీ కమల, బాష, ఎండి షాన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-గన్నవరం: వాసవ్య మహిళా మండలి, హెచ్‌సిఎల్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి వారి ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ స్టార్ట్ చేసి 47 సంవత్సరాలు అయిన సందర్భంగా 47 వేల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా వేములపల్లి లక్ష్మి అన్నపూర్ణమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం 47 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి యఎల్ టెక్నాలజీస్ నుండి 60 మంది స్టాఫ్ మరియు స్కూలు పిల్లలు, హెచ్‌ఎం ఝాన్సిరాణి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ విజయవాడ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సెంటర్ హెడ్ శివప్రసాద్, ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ బి శ్రీనివాసులు, రాజేష్, అడ్మిన్ డిపార్ట్మెంట్ శ్రీనివాస్, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి నుంచి డాక్టర్ మెరోజ్, డాక్టర్ సుదీప్తి వర్ధన్, డాక్టర్ అభినయ, వాసవ్య మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతను ఓటర్లుగా చేర్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలోని యువతను పెద్ద ఎత్తున ఓటర్లుగా చేర్పించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ వో యం వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, ఎన్నికల అధికారులు, క్షేత్రాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ, భూముల రీ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన యువతి యువకులపై ప్రత్యేక దష్టి సారించి వారిని తప్పనిసరిగా ఓటర్లుగా చేర్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా జిల్లా విద్యాధికారి అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లతో, ఏఈఆర్వో లైన తహసీల్దారులతో సమన్వయం చేసుకొని పెద్ద ఎత్తున యువజనులను ఓటర్లుగా నమోదు చేసుకునేలా చైతన్యపరచాలన్నారు.ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ముగింపు గడువు సమీపిస్తున్నందున అందరూ ప్రత్యేక శ్రద్ధ వహించి ఇంటింటి పరిశీలన కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని 62 గ్రామాల్లో రెండో దశలో చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా రీ సర్వే పూర్తి చేయాలన్నారు. బందరు, ఉయ్యూరు డివిజన్లలో రోవర్సు సరిగా వాడటం లేదని సరిహద్దురాళ్ళు వచ్చినప్పటికీ నాటడం లేదని దీంతో సరైన పురోగతి లేకుండా పోతుందన్నారు. ఇకపై అలసత్వం చూపితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ వారం రోజుల్లోగా సరైన పురోగతి సాధించాలని సూచించారు. 20 గ్రామాల్లో రీ సర్వే తో పాటు సరిహద్దు రాళ్ల నాటడం జరిగిందని, ఇంకా రీ సర్వే పూర్తయిన 14 గ్రామాల్లో సరిహద్దు రాళ్ళను నాటే కార్యక్రమాన్ని కూడా మరింత వేగవంతం చేయాలన్నారు.ఈ టెలి కాన్ఫరెన్స్లో మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు తహసిల్దార్లు పాల్గొన్నారు.

వైసిపి నాటకాన్ని తిప్పికొట్టండి

కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): దొడ్డిదారిన అధికారంలోకి రావడానికి అడ్డదారులు తొక్కుతున్న జగన్నాటకాన్ని తిప్పికొట్టాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర , టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. స్థానిక నియోజక వర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ క్లస్టర్ మరియు యూనిట్ ఇన్చార్జిలతో ఓటరు పరిశీలన కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని .రాష్ట్ర, దేశ భవిష్యత్తును నిర్ణయించడానికి ఉపయోగపడే ఓటును ఈ మధ్య అక్రమంగా ఓట్లను చేర్పించడం, తొలగించడం వంటివి జరుగుతున్నాయని సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. ఈ కుట్రను చేధించడానికి టిడిపి పెద్ద ఎత్తున కృషి చేస్తుందన్నారు. ఆగస్టు 21 వరకు ఇంటింటికీ జరిగే ఓటర్ జాబితాల పరిశీలనలో స్థానికంగా టిడిపి బిఎల్ఎలు ఓట్లను పరిశీలించి సమగ్రమైన ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలన్నారు. అలాగే స్థానికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ క్లస్టర్ యూనిట్ బూత్ కన్వీనర్లు సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు లుక్క శివరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు వేయలేని ప్రభుత్వాన్ని సాగనంపాలి : టిడిపి

ప్రజాశక్తి-పెదపారుపూడి: ప్రభుత్వ చేతకానితనం, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణ సంకటంగా తయారైంది. నాలుగేళ్ల పాలనలో.. రాష్ట్రంలో నాలుగు అడుగులు కూడా రోడ్లు వేయలేని జగన్ రెడ్డి పనితీరు ఆశ్చర్యకరంగా ఉందని పామర్రు నియోజకవర్గ ఇంఛార్జి వర్ల కుమార్ రాజా అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామం వద్ద గుడివాడ-కంకిపాడు రోడ్డును పరిశీలించారు. యమలోకానికి షార్ట్ కట్‌లా రోడ్లు తయారైనప్పటికీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ కనీసం పట్టించుకోవడం లేదు. బైకుపై వెళ్లేవారు నిత్య నరకం అనుభవిస్తున్నారు. వారానికో బస్సు ప్రమాదం, రోజుకు పది బైకు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాళ్లూ చేతులు విరిగి ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంటే.. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అందులో కూడా కమిషన్లు దండుకునేందుకు సిద్ధమవుతున్నాడే తప్ప.. పనులు చేసే ఆలోచన చేయడం లేదు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ పెంచి పోషిస్తున్న ఇసుక మాఫియా, మట్టి మాఫియాలతో రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. వారం రోజులు గడువిస్తున్నాం.. పనులు చేసి రోడ్లను మెరుగుపర్చకుంటే.. తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తానని వర్ల కుమార్ రాజా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి) మండల కార్యదర్శి మసిముక్కు రాంబాబు ,గ్రామ పార్టీ అధ్యక్షులు కూచిపూడి సుబ్బయ్య గ్రామ కార్యదర్శి బాబు , గుండపనేని శ్రీనివాస్(స్వామి) కలష్లాల కిషోర్ గొర్రెపర్తి రవికుమార్, డి లెనిన్, ఎం విజయబాబ్ను, పార్లమెంటు నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం ముస్తాబద్, బుద్ధవరం, అజ్జంపూడి, సూరంపల్లి గ్రామాల్లో మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాలకవర్గం ను శుక్రవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మత్స్య సహకార జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ మాట్లాడుతూ నూతన అధ్యక్షులను కమిటీ సభ్యులు ను అభినందించి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఆదేశాల మేరకు మత్స్య సహకార సంఘం ద్వారా పలు అభివద్ధి పలు అభివద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): ఉంగుటూరు మండలం పెద అవుటపల్లి గ్రామములో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంపిడిఓ జి.ఎస్.వి శేషగిరిరావు శుక్రవారం విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.తిరుపతమ్మ, పిహెచ్‌సి వైద్యాధికారి, ఎఎన్ఎంలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న కాశీనాథ్, తదితరులు

బాధిత కుటుంబానికి రూ.3.5 లక్షలు అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : గత నెల 15న డ్రైనేజీ వర్క్ చేస్తూ మృతి చెందిన కార్మికుడు మేడ మాణిక్యాలరావు కుటుంబానికి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకుల సమక్షంలో విఎంసి సర్కిల్-3 ఇంజినీరింగ్ అధికారులు రూ.మూడున్నర లక్షల డబ్బును శుక్రవారం అందజేశారు. విజయవాడ రూరల్ నున్న చెరువు సెంటర్‌లో నివాసముంటున్న మాణిక్యాలరావు భార్య మేయసోదకు నాయకులతో కలిసి డబ్బులను అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, నాయకులు టి ప్రవీణ్, ఇతర నాయకులు మాణిక్యాలరావు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దానిపై విఎంసి అధికారులు దిగి వచ్చి రూ. పది లక్షలు, ఉద్యోగం, ఇల్లు కార్పొరేషన్, మరో ఐదు లక్షలు అధికారులు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఆ ఒప్పందంలో భాగంగా రూ.మూడున్నర లక్షలు యూనియన్ నేతలు కాశీనాథ్, జ్యోతిబాస్, ప్రవీణ్ సమక్షంలో సర్కిల్-3 డిఇ పాత్రుడు, ఎఇ నాగేశ్వరరావు కార్మికుడి కుటుంబానికి అందజేశారు.

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చూపిస్తున్న నాయకులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని 39వ డివిజన్ శారద నగర్, బ్రహ్మయ్య వీధి, కామకోటి నగర్ ఋగ్వేద యజుర్వేద వేద స్మారక పాఠశాల వద్ద గల ట్రాన్స్‌ఫారం చాలా ప్రమాదకరంగా ఉండి, ఓపెన్‌గా వైర్లు కనబడుతున్నాయని, పిల్లలు తెలియక వాటివద్దకు వెళ్తే ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మెష్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖాధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు 39వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు ఏలూరు సాయి శరత్ విజ్ఞప్తి చేశారు. స్థానిక డివిజన్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో శుక్రవారం డివిజన్‌లో పర్యటించారు. చుండూరు వారి వీధి రోడ్లు అధ్వానంగా తయారైందని, హనుమాన్ కాలనీ కల్వర్టులు కాలువలో చెత్త పేరుకుపోయి దోమల బెడద ఎక్కువైందని అన్నారు. కాలువలు పూడిక సరిగా తీయకపోవటంతో దోమల వ్యాప్తి అధికంగా ఉందని స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను జనసేన నాయకులు కోరారు. డివిజన్ పర్యటనలో జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు ఏలూరు సాయి శరత్, ఉపాధ్యక్షులు తోటకోటి, రాచమల్లు, సాయి గణేష్, జక్కంపూడి కోటిరెడ్డి, ముఖి దీపక్, డివిజన్ నాయకులు పరిశీలించారు.

ఎంఎల్ఎ విష్ణుపై జనసేన ఆగ్రహం

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తన కల్తీ వ్యాపారాన్ని అదుపులో పెట్టుకోవాలి అని సెంట్రల్ జనసేన నేత బొలిశెట్టి వంశీకృష్ణ సూచించారు. నీ కల్తీ మద్యం వల్ల 20 కుటుంబాలు చిన్నాభిన్నమై పోయాయని, చనిపోయిన కౌలురైతుల కుటుంబాలకు పవన్ కళ్యాణ్ లక్ష రూపాయలు ఇచ్చి వాళ్ల కుటుంబాల్లో వెలుగు నింపుతున్నారని అన్నారు. విష్ణుబార్‌లో చనిపోయిన కుటుంబాలకి 10 రూపాయిలు ఇచ్చిన దాఖలు కూడా లేవన్నారు.

క్రీడల్లో రాణిస్తే..ఉన్నత విద్యలో రిజర్వేషన్లు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్యా ప్రవేశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్ రెడ్డి అన్నారు. సాఫ్ట్ బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన ఇద్దరికీ ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చినట్లు తెలిపారు. ఎంతో మంది జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసిన ఫిజికల్ డైరెక్టర్ టీ శ్రీలత పదోన్నతిపై నున్నకు వచ్చారు. ఈ సందర్భంగా నున్న హైస్కూల్‌లో విద్యార్థులకు కొత్తగా రెజ్లింగ్ ఆటను శుక్రవారం పరిచయం చేశారు. అనంతరం ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన సాఫ్ట్ బాల్ క్రీడాకారులు తురకా దివ్య (నూజివీడు), లేళ్ల పూర్ణ శ్రీ (శ్రీకాకుళం)ను హెచ్.ఎం.భూపాల్ రెడ్డి అభినందించారు. వారిద్దరిలో కుస్తీ క్రీడను పాఠశాలకు పరిచయం చేయడం విశేషం. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు చదువులో భాగమేనని, వాటిలో రాణిస్తే ఉన్నత విద్యలో ప్రవేశాలతో పాటు ఉద్యోగాల్లోను అదనపు ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. చదువులో అద్భుతంగా రాణించిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ నూజివీడు క్యాంపస్‌లో సీట్లు పొందగా, స్పోర్ట్స్ కోటాలో మరో ఇద్దరికి సీట్లు లభించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థి కనీసం రెండు క్రీడలు ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఇంచార్జి సూరపనేని రవి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ వర్మ, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భూపాల్ రెడ్డి

పొట్టి శ్రీరాములు కళాశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలోని సి.యస్.ఈ, సి.యస్.ఈ (ఐ.ఓ.టి) విభాగాల ఆధ్వర్యంలో ఆరు రోజుల జాతీయ స్థాయి వర్క్ షాప్ను ఏపిఎస్ఎస్‌డిసి వారి అధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ సి. సతీష్ కుమార్ పాల్గొని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రాజెక్ట్‌ని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ యూనిటీ సాఫ్ట్‌వేర్ ద్వారా 2డి 3డి గేమ్స్‌ను చాలా తేలికగా డిజైన్ చేయవచ్చన్నారు. యువత సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం సంపాదించడానికి ప్రోగ్రామింగ్ కేవలం ఒక మార్గం మాత్రమే అని, గేమింగ్ డిజైనింగ్ అండ్ యానిమేషన్ ద్వారా కూడా అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. పరిశ్రమలో విద్యార్థులు గేమ్ డిజైన్ మరియు గేమ్ డెవలపర్స్‌గా కనీసం రూ. 12 లక్షల వేతనంతో కొలువులు సాధించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ పి లక్ష్మణ స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మినారాయణ మాట్లాడుతూ గేమ్ డిజైనింగ్ అనేది ఒక కళాత్మక పక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తతీయ సంవత్సర సి.యస్.ఈ విద్యార్థిని ఉజుమా అక్తర్ శ్రీపల్లి మాట్లాడుతూ ఏపిఎస్-ఎస్‌సిడిసి వారి కార్యక్రమం ద్వారా సమాజానికి, ముఖ్యంగా చిన్నపిల్లల విద్యను అభివద్ధిపరిచే విధంగా గేమ్స్ డిజైన్ చేయగలననే నమ్మకం ఈ వర్క్‌షాప్ ద్వారా కలిగినందుకు తన సంతోషాని వ్యక్త పరిచింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలి శాస్త్రి, సి.యస్.సి విభాగాధిపతి డా. డి. దుర్గ ప్రసాద్, సి.యస్.ఈ (ఐ.ఓ.టి) విభాగాధిపతి ప్రొఫెసర్ శిల్పా పద్మానాభుని, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఫ్లూటీకా ప్రతి ఏటా ఇవ్వాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : వర్షాకాలంలో ఫ్లూ విజృంభించే అవకాశం ఉందని, పిల్లలు, పెద్దలు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ముఖ్యంగా చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు, నోరి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నోరి సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఆసుపత్రి ఆవరణలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా చిన్న పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, ఈ దశలో ఫ్లూ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫ్లూ వ్యాక్సినేషన్ వేయించడం కారణంగా చిన్నారులు, వృద్ధులు ఫ్లూ బారిన పడకుండా ఉంటారని తెలియచేశారు. ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్స్ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా 6 నెలల నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు, 50 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న వృద్ధులకు ప్రతి ఏటా ఫ్లూ వ్యాక్సినేషన్ అందించాలని సిఫార్సు చేస్తుందన్నారు. 5 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు ఆస్తమా, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక పరిస్థితులు ఉన్న వారికి ఫ్లూ కారణంగా సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. 4 ఇన్ 1 ఫ్లూ టీకా తీసుకోవడం వల్ల పిల్లలను ఫ్లూ, దాని సమస్యల నుండి రక్షించగలదని అన్నారు. ప్రతి ఒక్కరూ టీకా గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు సిబ్బంది నిరసన

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : విటిపిఎస్ పాత గేటు వద్ద స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు, ఇంజనీర్లకు తీవ్ర నష్టం చేకూర్చే వేతన ఒప్పందం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇది లోపాయికారీ ఒప్పందం అని, ఈ ఒప్పందాన్ని ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల స్ట్రగుల్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించిందని, చీకటి రద్దయ్యి కార్మికులకు, ఉద్యోగులకు న్యాయం జరిగేంత వరకు విద్యుత్ ఉద్యోగ కాంట్రాక్టు కార్మికుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధతం చేస్తామని అన్నారు ప్రభుత్వానికి లొంగిపోయి విద్యుత్ జెఎసి కార్మికులకు అన్యాయం చేయటం సిగ్గుచేటన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీస్ రేటు కార్మికులను పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్, విద్యుత్ ఉద్యోగ , కాంట్రాక్టు కార్మికుల స్ట్రగుల్ కమిటీ నాయకులు వాసుదేవన్ (సిఐటియు), యేసు రాజు, మల్లిఖార్జున (ఎఐటియుసి), (టీఎన్టిసీ) స్వతంత్ర కుమార్, దుర్గా రావు (సిఐటియు) రెహమతుల్లా, నాగరాజు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

18 నుండి శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫ్లిప్5 ఫోన్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద ఎలక్ట్రానిక్ బ్రాండ్ శామ్‌సంగ్ ఇటీవలే విడుదల చేసిన గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 5 ఫోన్లు ఈనెల 18వ తేదవీ నుండి విక్రయానికి అందుబాటులోకి రానున్నాయని శామ్‌సంగ్ ఏరియా ఇన్‌చార్జి ప్రతాప్ కుమార్ తెలిపారు. ఎప్పటికపుడు వినియోగదారులను ఆకట్టుకునేలా గెలాక్సీ ఫోన్లను తీసుకువస్తున్న శామ్‌సంగ్ సరికొత్తగా జెడ్ ఫ్లిప్5ను తీసుకువచ్చినట్లు తెలిపారు. మొదటి 28 గంటల్లో లక్ష మంది కన్నా ఎక్కువ మంది వినియోగదారులు గెలాక్సీ జెడ్ ఫ్లిప్5ను బుక్ చేసుకున్నారని తెలిపారు.

మ్యాజిక్ ఆఫ్ మామ్స్ పేరుతో విక్స్ అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, తలనొప్పికి తక్షణమే ఉపశమనాన్ని పొందేందుకుగానూ విక్స్ వాపోరబ్‌ను వినూత్న తరహాలో తీసుకువచ్చినట్లు కంపెనీ ప్రతినిధి రామ్ మనోహర్ తెలిపారు. విక్స్ వాపోరబ్ నూతన ఉత్పత్తులను తెలియచేసేందుకుగాను నగరంలోని పలు ప్రాంతాలలో అవగాహణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హృదయాన్ని కదలించే విధంగా మ్యూజిక్ ఆఫ్ మామ్స్ హ్యాండ్స్ పేరుతో నూతన ప్రచారంతో ప్రజల వద్దకు వెళుతున్నట్లు తెలిపారు.


కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

18న షాపు ఎంప్లాయీస్ ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : న్యాయమైన షాపు ఎంప్లాయీస్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున షాపు ఎంప్లాయీస్ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, వై సుబ్బారావు కోరారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే కనీస వేతన బోర్డు ద్వారా పెరిగిన ధరలకు అనుగుణంగా షాపు ఎంప్లాయీస్‌కు జీతాలు పెంచాలని కోరారు. షాపు ఉద్యోగులకు (కార్మికులకు) సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. షాపు ఎంప్లాయీస్ సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించే ధర్నాలో కార్మికులు, షాపు ఎంప్లాయీస్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు 3కె మెగా రన్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆంధ్ర క్రికెట్ ప్రతిష్టను పెంచాలన్న లక్ష్యంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎసిఎ ఆధ్వర్యంలో 12న నగరంలో 3కె మెగా రన్ నిర్వహించనున్నట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ రన్‌కు, ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా, ఎసిఎ జాయింట్ సెక్రటరీ ఎ.రాకేష్, భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఉపాధ్యక్షులు జి.గంగరాజు, కెడిసిఎ అదహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్ రాజు, కన్వీనర్ ఎం.రవి శంకర్, ఎసిఎ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్.గీత, కె.వి.పురుషోత్తం పాల్గొంటారన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.